మూడు నిమిషాల్లో కార్మికుల బాధలెట్ట చెప్పాలి?

- 12 డిమాండ్లలో ఒక్కదాన్నీ పరిష్కరించే చిత్తశుద్ధిలేదు
- ఆర్‌టిసి క్రాస్‌రోడ్డు నిరసనలో కార్మిక సంఘాల నేతలు
- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసిన నాయకులు

దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతి బడ్జెట్ సమావేశాల ముందూ కార్మిక సంఘాలతో కేంద్ర ప్రభుత్వం సమావేశంపెట్టి అభ్యంతరాలను స్వీకరించడం, సలహాలను పరిగణనలోకి తీసుకోవడం సాంప్రదాయకంగా వస్తోందని, ప్రస్తుత ఆర్థిక మంత్రి మాత్రం మొక్కుబడిగా ఆన్‌లైన్ సమావేశం పెట్టి మూడే నిమిషాలు మాట్లాడాలంటూ షరతులు పెట్టడం దారుణమని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నేతలు విమర్శించారు. ఆ కొద్ది సమయంలో కార్మికుల సమస్యలను, బాధలను కేంద్రం దృష్టికి ఏవిధంగా తీసుకురాగలుగుతామా? అని నిలదీశారు. కార్పొరేట్లకు రాయితీల మీద రాయితీలిస్తున్న కేంద్ర ప్రభుత్వం గత సార్వత్రిక సమ్మెల సందర్భంగా కార్మిక సంఘాలు ఐక్యంగా లేవనెత్తిన 12 డిమాండ్లలో ఒక్కదాన్నైనా పరిష్కరించిందా? అని ప్రశ్నించారు. కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్‌రోడ్డులో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. 'కార్మిక సంఘాల ఐక్యత వర్ధిల్లాలి...మోడీ సర్కారు డౌన్‌డౌన్...లేబర్ కోడ్లను రద్దు చేయాలి..పాత చట్టాలను పునరుద్ధరించాలి...కార్పొరేట్ శక్తులకు మోడీ సర్కారు దాసోహం సిగ్గుసిగ్గు...' అంటూ నినాదాలు చేశారు. కార్మిక సంఘాల మహిళా నేతలు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఎం సాయిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్‌రాజు, అధ్యక్షులు ఎమ్‌డి యూసుఫ్, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డి చంద్రశేఖర్, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బ రామారావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, రాష్ట్ర నాయకులు జనార్ధన్, స్వామి, ఎఐయుటియుసి రాష్ట్ర నాయకులు బాబురావు మాట్లాడారు. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కార్మిక సంఘాలతో మాట్లాడటానికి షరతులు పెట్టడం దారుణమన్నారు. భౌతికంగా సమావేశం పెట్టకుండా ఆన్‌లైన్‌లో నిర్వహించడమేమిటని ప్రశ్నించారు. సమావేశానికి ఒక్కరోజు ముందు నోటీసు పంపి మూడు నిమిషాలే మాట్లాడాలని చెప్పటం అన్యాయమన్నారు. దీనిని బట్టే కార్మికుల సమస్యలను వినటానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని అర్థమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పేద, మధ్యతరగతి వర్గాలపై మోయలేని భారం మోపుతున్నారని విమర్శించారు. అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. దేశ సంపదను మోడీ ప్రభుత్వం కార్పొరేట్, పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లాభాల బాటలో పనిస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను ఒక పథకం ప్రకారం ప్రయివేటీకరణ చేసుకుంటూ పోతున్న తీరును వివరించారు. ప్రజల సొమ్ముకు భద్రత కల్పిస్తూ సేవలందిస్తున్న బ్యాంకింగ్ రంగాన్ని కూడా ప్రయివేటుపరం చేసేందుకు మోడీ సర్కారు అడుగులు వేయటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు సాగిస్తామని ప్రకటించారు. అసంఘటితరంగ కార్మికుల కోసం సమగ్ర చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు ఎస్‌వి రమ, జె.వెంకటేశ్, భూపాల్, ఎం వెంకటేశ్, మధు, ఉపాధ్యక్షులు పి జయలక్ష్మి, ఆర్ కోటంరాజు, జె మల్లిఖార్జున్, కళ్యాణం వెంకటేశ్వర్లు, పద్మశ్రీ, మంద నర్సింహారావు, ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పి ప్రేంపావని, కార్యదర్శి ఓమయ్య, ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ యాదవ్, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు అరుణ, సిఐటియు రాష్ట్ర నాయకులు సోమన్న, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రాలో ముఖం చెల్లక తెలంగాణలో కుట్రలు

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రాలో ముఖం చెల్లక తెలంగాణలో దండులా విరుచుకు పడుతున్నారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వైఎస్సార్ టిపి అధ్యక్షురాలు షర్మిలపై పరోక్షంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రం దూసుకుపోతోందని తెలిపారు. తెలంగాణ రాక ముందు సమైక్యవాదులు ఇక్కడి వనరులను దోచుకున్న విధంగా, మళ్లీ ఇప్పుడు సమైక్య వాదులు కుట్రలు మొదలు పెట్టారని విమర్శించారు. షర్మిల, బండి, సంజయ్, గవర్నర్ వ్యవహారం, ఇడి, సిబిఐలు ఇలా అన్నీ చూస్తుంటే ముఖ్యమంత్రి కుటుంబంపై దాడి చేస్తున్నట్టుగా ఉందన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనలో ప్రజలు సబ్బండ వర్గాలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రం అన్ని రంగాల్లోనూ పురోగతి కనబడుతుందని.. అందుకే సమైక్య వాదులు కన్ను పడిందన్నారు. మళ్లీ దోచుకుందామని తెలంగాణలో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మోడీ బరి తెగిస్తూ తెలంగాణపై అడుగడుగునా విషం చిమ్ముతున్నారన్నారు. ఇప్పటికే దేశంలో ఎనిమిది రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం కూలదోసిందని తెలిపారు. ఇప్పుడు తెలంగాణపై పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వీయ రాజకీయ అస్తిత్వమే మనకు శ్రీరామరక్ష అని, దత్త పుత్రిక పాదయాత్ర చేస్తూ అడ్డగోలుగా ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సమాజం అప్రమత్తంగా ఉండాలని కోరారు.

గురుకుల కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీ అవకాశం

- ఆన్‌లైన్ ద్వారా తొమ్మిది వరకు దరఖాస్తు చేసుకోవాలి
- కార్యదర్శి డాక్టర్ మల్లయ్య భట్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహాత్మా జ్యోతిబా పూలే బిసి సంక్షేమ వ్యవసాయ మహిళా గురుకుల కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేయడానికి రిటైర్డ్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, బోధనా సిబ్బంది నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సంస్థ కార్యదర్శి డాక్టర్ మల్లయ్య బట్టు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వనపర్తి, కరీంనగర్‌లో ప్రారంభమైన ఆయా కాలేజీల్లో పనిచేయడానికి అర్హులైన వారు తమ బయోడేటాను mjpadmissioncell@gmail.comకు పంపించాలని ఆయన సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 14 ,15 తేదీల్లో డెమో/ఇంటర్వ్యూ నిర్వహిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు మహాత్మా జ్యోతిబా పూలే బిసి సంక్షేమ గురుకుల విద్యా సంస్థల వెబ్ సైట్ http://mjpt-bcwreis.telangana.gov.inను సందర్శించాలని సూచించారు.

మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
E.A. 110/2021 in E.P. 15/2020 in O.S. 104/2012
Between:
కట్టా చంద్రరావు అండ్ అనదర్ ...DHr
మరియు
అముజూరి పార్థసారథి మరియు ఇతరులు ...JDrs
టు: 3వ రెస్పాండెంట్ :
సాగిరాజు సత్యవేణి @ అముజూరి సత్యవేణి,
W/o. వంశీ కృష్ణరాజు, హిందూ, వయస్సు 30 సం॥లు, ఫ్లాట్ నెం.19, శ్రీ బాలాజీ నిలయం, బాలాజీ హిల్స్, నిజాంపేట, రంగారెడ్డి జిల్లా.
నోటీసు
పై నెంబరు గల EPలో 2వ DHr వారసులను చేర్చమని దాఖలు చేసిన పిటీషన్‌లో శ్రీ కోర్టువారు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినప్పటికీ మీరు ఉద్దేశ్యపూర్వకంగా నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారి ఆదేశం ప్రకారం మీకు తెలియజేయునది ఏమనగా పై నెంబరు గల EP **ది. 13-12-2022**న వాయిదా అయి ఉన్నది. కావున ఆ రోజు **ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేని యెడల పై పిటీషన్ మీకు పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.
|| ఇది శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం జారీచేయబడిన నోటీసు ||
పి.వి.ఎస్.ఆర్. మూర్తి, అడ్వకేట్
పిఠాపురం. డో.నెం. 4-2-133, కుచివారి వీధి,
ది.02-12-2022 పిఠాపురం. సెల్: 9848006149

పురుగుల అన్నం తినలేం

- వసతి గృహం ముందు విద్యార్థుల ఆందోళన

కస్తూర్బా గాంధీ స్పెషల్ ఆఫీసర్‌తో మాట్లాడుతున్న విద్యార్థినులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పురుగుల అన్నం తినలేకపోతున్నామంటూ విద్యార్థినులు ఆందోళనకు దిగారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో ఆదర్శ పాఠశాల బాలికల వసతిగృహం ఎదుట శుక్రవారం 60 మంది విద్యార్థినులు బైటాయించారు. డిఇఒ రావాలి.. మా దుస్థితి చూడాలి.. పురుగుల అన్నం తినలేక కడుపు మాడ్చుకుంటున్నామని రోదించారు. వారం రోజుల నుంచి పచ్చిపులుసు రవ్వతో తినలేక చస్తున్నామని ఆవేదన వెలుబుచ్చారు. మెనూ ప్రకారం వంటలు చేయడం లేదన్నారు. విషయాన్ని స్థానిక కస్తూర్బా గాంధీ స్పెషల్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పరిశీలించి సంబంధిత సిబ్బందికి మెమో జారీ చేసినట్టు వెల్లడించారు. ఎస్‌ఒ వచ్చినందున ఆ ఒక్కరోజు మాత్రమే నాణ్యమైన భోజనం పెట్టారని, ఆ తర్వాత మళ్లీ పాత పద్ధతే అవలంబిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వచ్చే వరకు భోజనం చేయబోమని, హాస్టల్ వార్డెన్‌తోపాటు వంట సిబ్బందిని తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే టీసీలు ఇస్తే హాస్టల్ వదిలి ఇంటికి వెళ్లి పోతామన్నారు. మంచినీరైనా లేక నానా ఇబ్బందులకు గురవుతున్నామని, బోరింగ్ నుంచి క్యాన్లలో నీళ్లు తెచ్చుకొని కాలం గడుపుతున్నట్టు చెప్పారు. రాత్రి సమయంలో సరైన లైటింగ్ లేక పాములు, తేళ్లు వస్తున్నాయన్నారు. వార్డెన్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పురుగుల అన్నం తినలేకపోతున్నామని వార్డెన్‌కు చెబితే.. "మీ కడుపులో లేవా.. మీ మెదల్లో పురుగులు లేవా" అని వ్యంగ్యంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకుని సమస్యలను పరిష్కరించాలని కోరారు.

దాడులకు భయపడే ప్రసక్తే లేదు

- వైఎస్సార్‌టిపిని ఎవరూ ఆపలేరు
- వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎవరెన్ని దాడులు చేసినా భయపడే ప్రసక్తేలేదని వైఎస్సార్‌టిపి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పష్టంచేశారు కొట్టినా.. చంపినా ఎట్టిపరిస్థితుల్లో వెనక్కితగ్గమన్నారు. పాదయాత్రనే కాదు వైఎస్సార్ టిపిని ఆపే దమ్ము ఎవరికీ లేదని తేల్చిచెప్పారు. ఇటీవల కాలంలో చోటుచేసుకున్న అంశాలు, టిఆర్‌ఎస్ ప్రతిఘటనపై షర్మిల శుక్రవారం లోటస్‌పాండ్‌లో పార్టీ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. పోలీసు నిర్బంధాలు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నేతల బెదింపులు, పాదయాత్ర కొనసాగింపుపై తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా చర్చించారు. పార్టీ నేతల అభిప్రాయాలు తీసుకున్న షర్మిల.. పాదయాత్రను తిరిగి ఈ నెల నాలుగు నుంచి మొదలుపెట్టి 14వ తేదీ వరకు కొనసాగించనున్నట్లు ప్రకటించారు. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం లింగగిరి గ్రామం నుంచి పాదయాత్రను తిరిగి ప్రారంభిస్తామని షర్మిల తెలిపారు. ఆపద సమయంలో తనతో ఉన్న ప్రతి ఒక్కరినీ గుర్తు పెట్టుకుంటానని.. వారంతా తన కుటుంబమని అన్నారు.సమావేశం అనంతరం పార్టీ నేతలతో కలిసి అదనపు డిజి జితేందర్‌ను షర్మిల కలిశారు. పాదయాత్రకు సంబంధించిన వివరాలను అదనపు డిజికి వివరించారు. పాదయాత్రకు భద్రత కల్పించాలని కోరారు. పాదయాత్రను కొనసాగించాలని కోర్టు ఇచ్చిన ఆర్డర్ కాపీని సైతం పోలీసులకు అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో సిఎం కెసిఆర్ చేసిన వాగ్దానాలు, ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై ప్రజలకు వివరిస్తూ పాదయాత్ర సాగిస్తామన్నారు. ఆగిన చోటు నుంచే పాదయాత్రను కొనసాగిస్తామని తెలిపారు. ఇప్పటివరకు 3,525 కి.మీ. మేర పాదయాత్రను పూర్తి చేశాం. నాలుగు వేల కిలోమీటర్ల పాదయాత్ర కొనసాగిస్తామన్నారు. పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా జరిగిన పరిణామాలను తెలంగాణ ప్రజలు గుర్తుపెట్టుకోవాలని కోరారు. టిఆర్‌ఎస్‌లో ఒకప్పుడు ఉన్న ఉద్యమకారులను పార్టీ నుంచి కావాలని వెళ్లగొట్టారని, ఇప్పుడు గూండాల మాదిరిగా వ్యవహరిస్తోన్న టిఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తల తీరును రాష్ట్ర ప్రజలు గమనించాలన్నారు. శాంతి భద్రతలు కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని షర్మిల తెలిపారు..

మహారాజశ్రీ అవనిగడ్డ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నం 8/2016
బిట్వీన్:
దాలిపర్తి వెంకట శ్రీనివాస్ ....వాది
మరియు
పయ్యావుల రమేష్ మరియు వగైరా
.....ప్రతివాదులు
టు :-
పింగళి గాయత్రి, భర్త. పి.ఎస్.ఆర్. మూర్తి
నివాసం: విద్యానగర్ రైల్వే స్టేషన్ దగ్గర, కిషోర్ నర్సింగ్ హోమ్ ప్రక్కన, హైదరాబాద్, తెలంగాణా రాష్ట్రం.
పై నంబరు దావాలో మీరు 3వ ప్రతివాది అయి ఉన్నారు. సదరు మీకు పై కోర్టు నుండి అనేక పర్యాయములు సమనులు చేయించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు చేయించవలసినదిగా పై కోర్టు వారు ఆర్డరు చేస్తూ ది. 8. 12. 2022వ తేదీన వాయిదా వేసియున్నారు. కావున ఆరోజు ఉదయం 10.30 గం.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేదా మీ న్యాయవాది ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియ చేసుకొనవలసి యున్నది. లేనిచో మీ పరోక్షమున దావా తీర్మానం చేయబడునని ఇందుమూలంగా తెలియ చేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా : 8. 12. 2022
ఇట్లు
యం.రాంబాబు
బొప్పన. సుబ్రమణ్యేశ్వరరావు
అడ్వకేట్స్
అవనిగడ్డ-521121
ఫోన్ నం.: 9949332270, 9849994451



హైకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలి

ఇందిరాపార్కు వద్ద డిఎస్‌సి-2008 అభ్యర్థుల దీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డిఎస్‌సి మెరిట్ అభ్యర్థులను ఉద్యోగాల్లోకి తీసుకోవాలన్న హైకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద డిఎస్‌సి-2008 బిఇడి అభ్యర్థులు 'కెసిఆర్ వేడుకోలు' నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు, టిపిఆర్‌టియు వ్యవస్థాపక అధ్యక్షులు హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్‌టియు సెక్రటరీలు కరుణాకర్ రెడ్డి, పోల్ రెడ్డి, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు ఇందిరాశోభన్, డిఎస్‌సి- 2008 మెరిట్ అభ్యర్థుల అసోసియేషన్ అధ్యక్షులు ఉమామహేశ్వర్ రెడ్డి మాట్లాడారు. డిఎస్‌సి-2008లో ఎంపికైన అభ్యర్థులు అప్పటి ప్రభుత్వ నిర్ణయాల వల్ల తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, వారికి ఉద్యోగాలు ఇస్తామని 2016 వరంగల్ మహాసభలో సిఎం కెసిఆర్ ప్రకటించారని, ఫైల్‌నూ మొదలుపెట్టారని చెప్పారు. కానీ ఇప్పటికీ ఆ ఫైల్‌కు మోక్షం రాలేదన్నారు. ఎపిలో సిఎం జగన్ అక్కడి 2008 -డిఎస్‌సి అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. తెలంగాణలో మాత్రం అభ్యర్థులకు ఎదురుచూపులే మిగిలాయన్నారు. నష్టపోయిన అభ్యర్థులను ఉద్యోగాల్లోకి తీసుకోవాలని ఆనాడు హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. అప్పటి నుంచి అభ్యర్థులు అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారన్నారు. ఈ విషయంపై విద్యాశాఖ మంత్రికి లేఖలూ రాశామని చెప్పారు. సిఎంకు ఈ విషయం చేరిన రోజే సమస్య పరిష్కారం అవుతుందని.. తమను సిఎం వద్దకు తీసుకెళ్లాలని, లేకపోతే తమ సమస్యనైనా కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లాలని వేడుకున్నారు. ఈ దీక్షలో అభ్యర్థులు తమ పిల్లలతో కలిసి ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేపట్టారు. డిఎస్‌సి- 2008 బిఇడి మెరిట్ క్యాండిడేట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సింగారి సంగమేశ్వర్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ నాయక్, సతీష్ కుమార్, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ చావ్లా, జయప్రకాష్, రమేష్ విజయలక్ష్మి, నాగేష్, నరేష్ పాల్గొన్నారు.

ప్రతి చెరువుకు నీళ్లు చేరవేయడమే లక్ష్యం

- కాల్వల పనులు త్వరగా పూర్తి చేయాలి
- ఇరిగేషన్ పనుల పురోగతిపై మంత్రి హరీశ్‌రావు సమీక్ష


సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతి ఊరికి, ప్రతి చెరువుకూ కాల్వలు, మైనర్ కాల్వల ద్వారా నీళ్లు చేరవేయడమే లక్ష్యంగా పని చేద్దామని ప్రజాప్రతినిధులు, అధికారులకు ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు దిశానిర్దేశం చేశారు. మైనర్ ఇరిగేషన్ కాల్వ భూసేకరణ తొందరగా చేపట్టి, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ సిద్ధిపేటలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మల్లన్న, రంగనాయక సాగర్ జలాశయం ద్వారా కాల్వలు, మైనర్ కాల్వల పనుల పురోభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, ఆర్‌డిఒ, ఇరిగేషన్ ఇఇ, డిఇ, ఇంజినీరింగ్ అధికారులతో మంత్రి సమీక్షించారు. మైనర్ ఇరిగేషన్ పనులకు కావాల్సిన వాటిలో చిన్నకోడూర్ మండలంలో కస్తూరిపల్లి చెక్ డ్యాం, మల్లారం చెక్ డ్యాం, నారాయణరావుపేట మండల కేంద్రమైన పెద్దచెరువు కాజ్ వే, గోపులాపూర్ చెక్ డ్యాం, ఇబ్రహీంనగర్ గ్రామ మిట్ట మల్లయ్య చెరువు రిస్టోరేషన్ పనులు, గుర్రాలగొంది చెరువు, రాజగోపాల్ పేట, నంగునూరు చెరువులకు కాజ్‌వే నిర్మాణ పనులకు వెంటనే అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ ఇఇ సాయిబాబాను ఆదేశించారు. మల్లన్నసాగర్ 1ఆర్ కాలువ ఆయకట్టు 21000 ఎకరాల పనుల్లో వేగం పెంచాలని చెప్పారు. మల్లన్నసాగర్ 1ఆర్ పరిధి గ్రామాల మీదుగా వెళ్లే కాల్వ భూసేకరణ, నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మల్లన్న సాగర్ 3ఆర్, 4ఆర్ కాల్వపై చర్చించారు. పుల్లూర్ గ్రామ పడమట చెరువు, వెంకటయ్య చెరువు, నాగుల కుంటకు నీళ్లు నింపితే ఆ ప్రాంత రైతులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. రంగనాయకసాగర్ ఎల్‌ఎంసి-ఆర్ 8 కాలువ వాగు క్రాసింగ్ బ్రిడ్జి పనులు వేగంగా పూర్తి చేయాలని, ఏజన్సీ, ఇరిగేషన్ అధికారిని ఆదేశించారు. ఆర్ 8 కాలువ ద్వారా మాటిండ్ల గ్రామం వరకు నీళ్లు ఇవ్వాలని సూచించారు. రంగనాయకసాగర్ ఎల్‌ఎంసి-ఆర్ 3- ఆర్ ఎం 2-ఎల్‌ఎస్‌ఎం5 కాలువ పనులు, భూసేకరణ త్వరగా పూర్తి చేసి మైలారం, కమ్మర్లపల్లి, చౌడారం, అల్లీపూర్‌కు వెంటనే నీళ్లు ఇవ్వాలని, అలాగే నంగునూర్ మండలం ఘనపూర్, అక్కేనపల్లి, గట్లమల్యాల గ్రామాలకు వాగు మీద జరుగుతున్న లిఫ్ట్ పనులు త్వరితగతిన పూర్తి చేసి నీళ్లు ఇవ్వాల,ని అధికారులకు, ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకుంటూ అడ్డంకులను అధిగమించాలని దిశానిర్దేశం చేశారు. నాగరాజుపల్లి ద్వారా వాగులోకి ఎల్ డి10 కాలువ ద్వారా వాగులోకి నీళ్లు ఇవ్వాలని, నంగునూర్ మండలంలో కాలువ ఎల్ డి6-ఎల్ ఎం 1 పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.

మత్స్య సహకారం సంఘాలు ఏర్పాటు చేయాలి

నీటి వనరులపై నూతన సొసైటీల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన దరిమిలా మత్స్యకారులకు కొత్త సొసైటీల ఏర్పాటు కసరత్తు త్వరితగతిన ప్రారంభించాలని జిల్లా మత్స్యకార శాఖ అధికారిని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. కొత్త సభ్యులకు ప్రభుత్వ పథకాలతో పాటు సబ్సిడీ రుణాలు, బీమా సౌకర్యం లభిస్తాయన్నారు. సంఘాల్లో చేరే వారికి నైపుణ్య పరీక్షలు నిర్వహించి అర్హత సాధించిన వారికే మెంబర్‌షిప్ ఇస్తారన్నారు. సమీక్ష సమావేశంలో సుడా చైర్మెన్ రవీందర్ రెడ్డి, చిన్నకోడూర్ ఎంపీపీ కూర మాణిక్ రెడ్డి, నాయకులు చందర్‌రావు, ఆర్డీఓ ఆనంతరెడ్డి, ఇరిగేషన్ ఈఈ సాయి బాబా, డీఈ, ఏఈఈ ఖాజా, ఏఈఈ అమరజీవి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF 5TH JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD.
O.S.No. 5198 of 2021
Between :
Mirza Ahmed Ali Khan
S/o. Late Jahandarunnisa Begum
R/o. H. No. 17-5-614, Balsetty Kheith,
Dabeerpura, Hyderabad.
....plaintiff
and
1. C. Ratna Kumar,
S/o Late C.V. Ramana R/o. 11-1-357,
Mylargadda, Secunderabad.
2. Hameeda Begum,
D/o. not Known to the plaintiff
R/o. plot No. 12, in Survey 49,
Fakrul Mulk Estate, S.R.nagar,
Hyderabad.
.....Defendants
To,
C. Ratna Kumar, S/o. Late C.V. Ramana
aged about: 58 Years, Occ:Service,
R/o. 11-1-357, Mylargadda,
Secunderabad.
.... Defendant no.1
please take notice that the above named plaintiff filed the above suit for permanent injunction against above named defendants and the above suit is posted for your appearance on 21-12-2022 before the Hon'ble 5th junior Civil judge, City Civil Court, at Hyderabad. Hence you may appear before the above said Hon'ble Court on 21-12-2022 at 10.30 A.M. either in person or through advocate, failing which the matter will be decided ex-parte.
//By ORDER OF THE COURT//
C. NANDLAL
Advocate
22-1-169/2, Chaderghat,
Hyderabad

వివిటి ఎపి వర్సిటీతో బర్మింగ్ హామ్ యూనివర్సిటీ ఒప్పందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వివిటి ఎపి స్కూల్ ఆఫ్ లా (విఎస్‌ఎల్), విఐటి ఎపి విశ్వవిద్యాలయం, యునైటెడ్ కింగ్‌డమ్‌లోని బర్మింగ్ హామ్ విశ్వవిద్యాలయం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. గురువారం విఐటి ఎపి వర్సిటీ విసి డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి, బర్మింగ్ హామ్ విశ్వవిద్యాలయ గ్లోబల్ ఎంగేజ్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ పాల్ మెక్ కానెల్ ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం కోటారెడ్డి మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా వర్సిటీలోని విఐటి ఎపి స్కూల్ ఆఫ్ లా, ఇతర విభాగాల విద్యార్థుల ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. గ్లోబల్ స్కూల్‌గా మార్చేందుకు, విద్యార్థులను అంతర్జాతీయంగా నిపుణులుగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుందని చెప్పారు. అంతర్జాతీయ చట్టం, మానవ హక్కులు, వ్యాపారం, వాణిజ్య చట్టాలు, మేధోసంపత్తి చట్టాలు, కొత్తగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానం చట్టం, ఇతర సమకాలీన చట్టాలను అధ్యయనం చేసేందుకు ఎక్సలెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సంసిద్ధంగా ఉందని వివరించారు. బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయంలో ఒక సెమిస్టర్ లేదా ఒక ఏడాది చదువుకునే అవకాశాన్ని కల్పించడంలో ఈ ఒప్పందం సహాయ పడుతోందని అన్నారు. పాల్ మెక్ కానెల్ మాట్లాడుతూ విఐటి ఎపి స్కూల్ ఆఫ్ లా, బర్మింగ్ హామ్ విశ్వవిద్యాలయం మధ్య విద్యాపరమైన, సామర్థ్యాల పెంపుదల, అకడమిక్‌లను ప్రోత్సహించడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని చెప్పారు. భవిష్యత్తులో మరింత సహకారంతో పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విఐటి ఎపి వర్సిటీ రిజిస్ట్రార్ జగదీశ్ చంద్ర ముదిగంటి, విఐటి ఎపి స్కూల్ ఆఫ్ లా డీన్ బెనర్జీ చక్కా పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రతాప్

హైదరాబాద్‌లో అట్లాస్ చిరోప్రాక్టిక్ సెంటర్ ఏర్పాటు

ప్రజాశక్తి- హైదరాబాద్

చిరోప్రాక్టిక్ ఆరోగ్య సంరక్షణ సేవల సంస్థ అట్లాస్ చికోప్రాక్టిక్ అండ్ వెల్‌నెస్ సంస్థ తమ నూతన సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది. దేశంలో ఇది తమకు ఐదవ కేంద్రమని చిరోప్రాక్టిక్ హెడ్, అట్లాస్ డైరెక్టర్ డాక్టర్ ప్రతాప్ అడ్డగీతల తెలిపారు. ఈ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రతాప్ శుక్రవారం మాట్లాడుతూ.. ఇప్పటికే తమకు బెంగళూరు, చెన్నైలో రెండేసి చొప్పున సెంటర్లు ఉన్నాయన్నారు. వచ్చే ఏడాది ఎనిమిది కేంద్రాలకు విస్తరించనున్నామన్నారు. వెన్ను, మెడనొప్పి మొదలు దీర్ఘకాలిక నాడీ సంబంధిత వ్యాధుల సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు అందుబాటు ధరలలో మెరుగైన సేవలనందించాలనే కంపెనీ నిరంతర ప్రయత్నాలకు నిదర్శనంగా హైదరాబాద్‌లోని అట్లాస్ చిరోప్రాక్టిక్ అండ్ వెల్‌నెస్ సెంటర్ నిలుస్తుందన్నారు. హైదరాబాద్ ఆఫీస్‌లో హెడ్ క్లీనిషియన్‌గా ఫ్రాన్స్‌కు చెందిన డాక్టర్ యాస్మిన్ ఐస్సా వ్యవహరించనున్నారన్నారు.

నాగోల్ కాల్పుల ఘటనపై విచారణ వేగవంతం

- చోరీ చేసిన వాహనాలతో దోపిడీ
- బాధితులను పరామర్శించిన సిపి మహేశ్ భగవత్

మీడియాతో మాట్లాడుతున్న సిపి మహేశ్ భగవత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నాగోల్‌లోని ఓ బంగారం షాపులో గురువారం రాత్రి జరిగిన కాల్పుల ఘటనపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. నిందితులు చోరీ చేసిన వాహనాలపై వచ్చి ఈ దోపిడీ చేసినట్టు పోలీసులు గుర్తించారు. రెండు వాహనాలకు నెంబర్లు తొలిగించిన నిందితులు దోపిడీకి పాల్పడ్డారు. ఎన్‌జీవోస్ కాలనీలో నివాసముంటున్న కల్యాణ్ చౌదరి స్నేహపురి కాలనీ రోడ్‌నెంబర్-6లో మహదేవ్ జువెల్లరీ దుకాణం నడిపిస్తున్నారు. కాల్పుల ఘటనలో వీరిద్దరూ గాయపడ్డారు. వీరిని నాగోల్‌లోని సుప్రజ ఆస్పత్రిలో రాచకొండ సిపి మహేష్ భగవత్ శుక్రవారం పరామర్శించారు. ఇద్దరికి ఆపరేషన్ చేసినట్టు వైద్యులు తెలిపారు. కాల్పుల ఘటన గురించి బాధితులను సిపి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. గురువారం రాత్రి తొమిది గంటల సమయంలో నగల షాపులో కాల్పులు జరిగాయన్నారు. బంగారం బ్యాగ్‌తో పరారయ్యేందుకు దుండగులు యత్నించగా వారిని షాపు యజమాని, బంగారం సప్లయర్ అడ్డుకున్నారని చెప్పారు. దాంతో ఇద్దరిపై నిందితులు నాలుగు రౌండ్లు కాల్పులు జరిపారని తెలిపారు. వెంటనే తమ సిబ్బందిని అప్రమత్తం చేశామని.. నిందితులను పట్టుకునేందుకు ఎస్ఒటి, స్పెషల్ బ్రాంచ్‌తోపాటు 15 ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని స్పష్టం చేశారు. ఘటనలో నలుగురు వ్యక్తులు పాల్గొన్నట్టు తెలుస్తోందన్నారు. ముందుగా రెక్కీ నిర్వహించి దోపిడీకి పాల్పడినట్టు అనుమానిస్తున్నామని సిపి తెలిపారు. 2018లో కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో ఇదే తరహాలో దోపిడీ జరిగిందని గుర్తు చేశారు. ఆ ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని.. ఆ ముఠాకు చెందిన వారెవరైనా ఈ దొంగతనానికి పాల్పడ్డారా అనే కోణంలో ఆరా తీస్తున్నామని చెప్పారు.

రెండు కిలోల బంగారం, రూ.1.70 లక్షలతో దుండగులు పరారైనట్టు తెలుస్తోందన్నారు. దోపిడీకి నెంబర్ ప్లేట్ లేని వాహనాలు వాడినట్టు చెప్పారు. సంఘటనా స్థలంలో ఫింగర్ ప్రింట్స్ సేకరించామని, డాగ్‌స్క్వాడ్ ద్వారా తనిఖీలు చేశామన్నారు. సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నామన్నారు. కాల్పులు జరిపిన వ్యక్తులు తెలిసిన వారే అనే కోణంలో సైతం ఆరా తీస్తున్నామన్నారు. కాల్పుల్లో గాయపడిన ఇద్దరి పరిస్థితి నిలకడగానే ఉందని తెలిపారు.

పిఎస్‌హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయండి

- మంత్రి హరీశ్‌రావుకు టిఎస్‌పిటిఎ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రాథమిక పాఠశాలల్లో హెడ్మాస్టర్ (పిఎస్‌హెచ్‌ఎం) పోస్టులను వెంటనే మంజూరు చేయాలని టిఎస్‌పిటిఎ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆర్థిక మంత్రి టి హరీశ్‌రావుకు శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ షౌకత్ అలీ, పిట్ల రాజయ్య నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆ పోస్టులను మంజూరు చేస్తామంటూ అసెంబ్లీ సాక్షిగా సిఎం కెసిఆర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. పిఎస్‌హెచ్‌ఎం పోస్టుల దస్త్రాన్ని ఆమోదించి జిఒ జారీ చేయాలని కోరారు. 317 జిఒ ద్వారా ఉత్పన్నమైన సమస్యల పరిష్కరించాలని తెలిపారు. సూపర్ న్యూమరరీ పోస్టులను మంజూరు చేయాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న 13 జిల్లాల స్పౌజ్ బదిలీలను పూర్తి చేయాలని తెలిపారు. పిఆర్‌సి సిఫారసుల ప్రకారం పెండింగ్ జిఒలను జారీ చేయాలని పేర్కొన్నారు. ఈ-కుబేర్ పెండింగ్ బిల్లులను ఆమోదించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వివరించారు. సమస్యలను ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామంటూ మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌పిటిఎ ఆర్థిక కార్యదర్శి శ్యాంసుందర్, నాయకులు సత్యం, ఎం శ్రీనివాస్, రమేష్, సురేష్ కుమార్, కృష్ణారెడ్డి, బత్తిని స్వప్న, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

బిజెపి వదిలిన బాణం షర్మిల

- కవిత, బిఎల్ సంతోష్‌లను అరెస్ట్ చేయాలి
- ఎమ్మెల్యే జగ్గారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్సీ కవిత, బిజెపి నేత బిఎల్ సంతోష్‌లను అరెస్టు చేయాలనేదే తమ అజెండాగా తీసుకోనున్నట్టు పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌టిపి అధ్యక్షురాలు షర్మిల హద్దులు దాటి మాట్లాడుతున్నారన్నారు. ఆమె మహిళ కాకుంటే తమ స్పందన వేరుగా ఉండేదని వ్యాఖ్యానించారు. తామూ లోతైన విమర్శలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. షర్మిల బిజెపి వదిలిన బాణం.. ఎవరికి తగులుతుందో తెలియదన్నారు.

బిజెపి ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలను రంగంలోకి దించగా.. టిఆర్ఎస్ ప్రభుత్వం ఎసిబి, పోలీసు విభాగాలను వాడుకుంటోందని ఆరోపించారు. అరెస్టు చేసుకుంటే చేసుకోండని అంటున్నా.. ఎమ్మెల్సీ కవిత భయపడుతోందని విమర్శించారు. కవిత ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఉందని, ఆమెను అరెస్టు చేస్తామని బిజెపి ప్రభుత్వం సంకేతాలు ఇస్తోందన్నారు.

మోడీ, అమిత్ షాలు తెర వెనుక ఉండి ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారాన్ని నడిపించారని ఆరోపించారు. బిఎల్ సంతోష్‌ను కాపాడేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని, ఆయన అరెస్టయితే చాలా విషయాలు బయటకు వస్తాయని పేర్కొన్నారు. లిక్కర్ స్కామ్ కంటే బిఎల్ సంతోష్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం అతిపెద్ద కుంభకోణమని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతలను కూడా ట్రాప్ చేయాలని బిజెపి చూస్తోందన్నారు. త్వరలోనే కాంగ్రెస్ నాయకులంతా సమావేశమై ఆ ఇద్దరినీ అరెస్టు చేయాలని పోరాటం చేసే అంశంపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

'కిభో' దగా..!

KIBHO

- డిజిటల్ క్రిప్టో కరెన్సీ పేరుతో దోపిడీ
- మహిళలు టార్గెట్‌గా మోసం
- అకౌంట్ కోసం ఒక్కొక్కరి నుంచి రూ.500 వసూలు
- తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశాల్లోనూ దందా
- ఆకర్షణీయ ఆఫర్లతో రూ.వందల కోట్లు దోచుకున్న వైజాగ్ కేటుగాడు!

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డోర్నకల్‌కు చెందిన మాదేశ్... కొత్తగూడెం వాసి వెంకటేశ్... ఖమ్మం నివాసి రవి.... మహబూబాబాద్‌లో ఓ మహిళ... భద్రాద్రిలో మరో మహిళ... ఇలా చెప్పుకుంటూ పోతే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా...రాష్ట్రాల్లో ముఖ్యంగా పేద, మధ్యతరగతి వర్గాలు...అందునా మహిళలను టార్గెట్ చేసుకుని ఒక్కొక్కరి నుంచి రూ.500 చొప్పున ఏకంగా 40 లక్షల మంది నుంచి రూ.200 కోట్లకు పైగా వసూలు చేశాడు ఎపిలోని వైజాగ్‌కు చెందిన ఓ కేటుగాడు.

డిజిటల్ క్రిప్టో కరెన్సీ అంటూ బిట్ కాయిన్, సటోషి నకమొటో గ్రూప్‌లలో పెట్టుబడులు పెట్టి రూ.కోట్లలో ఆదాయం సముపార్జించిన కొందర్ని ఉదాహరణగా చూపుతూ...ఆకర్షణీయమైన ఆఫర్లు సైతం ప్రకటించడంతో పలువురు రూ.వేలల్లో చెల్లించి సభ్యత్వాలు తీసుకుంటున్నారు. చైన్ సిస్టం ద్వారా జరిగే ఈ క్రిప్టో కరెన్సీ వ్యాపారంలో సభ్యత్వం తీసుకుంటే మార్చి 2023 నాటికి కోటీశ్వరులు కావచ్చని కిభో సంస్థ సూపర్ సిఇఒ సూచిస్తున్నాడు. ఏరియాల వారీగా సిఇఒలు, లీడర్లను ఏర్పాటు చేసి ప్రజలను మభ్యపెడుతున్నాడని సమాచారం.

క్రిప్టో కరెన్సీ ప్రమాణాల్లో ఒక్కటీ కిభోకు లేదు...

క్రిప్టో కరెన్సీకి ఉండాల్సిన ప్రమాణాల్లో ఒక్కటీ కిభోకు లేదు. దీనిలో చెల్లించిన డబ్బులకు గ్యారెంటీ లేదు. కంపెనీ అడ్రస్సూ ఎక్కడ వెదికినా కనిపించదు. క్రిప్టో కరెన్సీకి ఉండాల్సిన బ్లాక్ చెయిన్, వైట్ పేపర్, రోడ్ మ్యాప్ వంటి ప్రమాణాలేవీ దీనిలో మచ్చుకైనా కనిపించవు. ఎన్నికాయిన్స్ మైనింగ్ చేయగలమో సూచించాలి. క్రిప్టో కంపెనీకి ఫ్రీమైనింగ్ ఉండాలి. ఈ ఫ్రీమైనింగ్ ద్వారా కమ్యూనిటీ పెంచుకోవాలి. క్రిప్టో కంపెనీ వివరాలు, పరిధి తెలియజేయాలి. కంపెనీ లక్ష్యాలు, స్పష్టీకరణలు వెల్లడించాలి. కానీ ఇవేవీ కిభో విషయంలో కనిపించవు. అస్సలు ఇండియాలో క్రిప్టో కరెన్సీకి అనుమతులే లేవు. ఇటీవల డిజిటల్ కరెన్సీకి ఆర్‌బిఐ అనుమతించినా...క్రిప్టోకు మాత్రం అనుమతివ్వలేదు. కానీ కిభో మాత్రం ఆ పేరిట వ్యాపారం నిర్వహిస్తుండటం చర్చనీయాంశమైంది. కిభో వైట్‌పేజీలో అంకెలు మాత్రమే కనిపిస్తాయి. ఓపెన్ చేస్తే కంపెనీ వివరాలు ఏవీ కనిపించకపోవడం గమనార్హం. క్రిప్టో కరెన్సీ కంపెనీకి ఉండాల్సిన లక్షణాల్లో ఒక్కటీ కిభో వెబ్‌సైట్‌లో కనిపించదు.

కిభో ఆఫర్లు...

కిలపర్తి భోవర్దన్ (కిభో) పేరుతో ఆంధ్రాకు చెందిన ఓ వ్యక్తి సూపర్ సిఇఒగా నిర్వహిస్తున్న కిభో క్రిప్టో కరెన్సీ ఆఫర్లు అదిరిపోయేలా ఉన్నాయి. ప్రస్తుతం అమెరికన్ డాలర్ విలువ రూ.82 చొప్పున పలుకుతుంటే కిబో కాయిన్ విలువ రూ.111 కావడం గమనార్హం. రూ.500 చెల్లిస్తే నాలుగు కాయిన్స్ లభిస్తాయి. కంపెనీ ఐడీ వస్తుంది. చైన్‌సిస్టంలో భాగంగా ఒకరిని చేర్పిస్తే రూ.100 నుంచి రూ.150, అదే మహిళలలైతే రూ.300 లేదా రూ.350 విలువైన కాయిన్స్ వస్తాయి. 66 మందిని చేర్పిస్తే రూ.33వేల మొబైల్ ఫోన్ గిఫ్ట్, 132 మందైతే రూ.66వేల విలువ చేస్తే ఓ బైక్, 1,584 మందిని చేర్పిస్తే మాత్రం ఏకంగా ఓ కారు బహుమతిగా ఇస్తారట. ఇవన్నీ వస్తు రూపేణో, డబ్బుల రూపంలోనో ఇవ్వరు సుమా. ఇవీ కిభో కాయిన్స్ రూపంలో ఇస్తారు. వీటిని అమ్ముకోవాలి. ఒకవేళ అమ్ముడుపోకపోతే చేతి నుంచి ఇఎంఐలు చెల్లించాల్సి ఉంటుంది. ఇంతేకాదు కిభో నాన్‌స్టేకబుల్ (నిల్వ ఉండని కాయిన్స్), ఫోన్‌పే తరహాలో కిభో పే, కిభో మార్ట్, కిభో పెట్రోల్ స్టేషన్స్, కిభో జ్యూయలరీ...ఇలా అనేక రకాల క్రిప్టో ఎరలు వేయడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వేలాది మంది సభ్యత్వం తీసుకున్నట్లు తెలుస్తోంది. జరిగిన మోసాన్ని చెప్పుకుంటే పరువు పోతుందని ఎవరూ ముందుకు రావడం లేదు.

'కిభో' మాయలో విలవిల...

కిభో కంపెనీ మాయలో పడి ఇలా అనేక మంది చైన్‌సిస్టంలో భాగంగా వందలాది మందిని సభ్యులుగా చేర్చారు. రూ.500తో కోటీశ్వరులం అవుతామనే ఆశతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలను టార్గెట్‌గా చేసుకుని ఈ మాయకు తెరలేపారు. ఇంతటితో ఆగకుండా లోన్ల పేరుతోనూ దగాకు పాల్పడటంతో బాధితులు సిఇఒలు, లీడర్లను నిలదీస్తున్నారు. ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, ముక్కలపల్లి, పాల్వంచ, టేకులపల్లి, కారేపల్లి, ఆళ్లపల్లి తదితర ప్రాంతాల్లోని వేలాది మంది సభ్యులుగా చేరినట్టు సమాచారం అందుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఐదు వేల మందికి పైగా సభ్యత్వాలు తీసుకుని రూ.25 లక్షలు చెల్లించినట్లు తెలుస్తోంది. దీనిలో రూ.500, వెయ్యి రూపాయలు చెల్లించిన పలువురు పోతేపోనీ అన్నట్టుగా ఉండగా...రూ.వేలల్లో చెల్లించిన వారు మాత్రం కంపెనీ చేసిన మోసంతో తలలు పట్టుకుంటున్నారు. తమను సభ్యులుగా చేర్పించిన వారిపై మండిపడుతున్నారు.

దురాశతో మోసపోవద్దు...
డాక్టర్ వినీత్, ఎస్‌పి, భద్రాద్రి కొత్తగూడెం

ఆర్బీఐ అనుమతిలేని క్రిప్టో కరెన్సీపై వ్యామోహంతో డబ్బులు చెల్లించి మోసపోవద్దు. ఇలాంటి మోసకారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఫేక్ కరెన్సీ సంస్థల సమాచారం ఇవ్వాలి. క్రిప్టో కరెన్సీపై పోలీసుస్టేషన్ల వారీగా అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కిభో పేరుతో జరుగుతున్న మోసంపై దృష్టి సారిస్తాం.

రెండోసారి ఐటి విచారణకు భద్రారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదాయపన్నుశాఖ కార్యాలయంలో విచారణకు మరోసారి మంత్రి మల్లారెడ్డి రెండో కుమారుడు భద్రారెడ్డి శుక్రవారం హాజరయ్యారు. ఆయన్ను అధికారులు రెండోసారి ప్రశ్నించారు. కళాశాలలో సీట్ల కేటాయింపుపై ఐటీ అధికారులు అడిగిన ప్రశ్నలకు భద్రారెడ్డి సమాధానాలు చెప్పారు. మొదటి రోజు విచారణలో భాగంగా ఐటీ అధికారుల ప్రశ్నలకు సరైన వివరాలు ఇవ్వకపోవడంతో మరోసారి ఐటీ అధికారులు తమకు కావాల్సిన ఫార్మాట్‌లో వివరాలు తీసుకురావాలని గత విచారణలో భద్రారెడ్డికి చెప్పారు. ఈమేరకు ఆయన రెండోసారి విచారణకు హాజరై ఆదాయపన్నుశాఖ అడిగిన పత్రాలను సమర్పించారు.

మూడు నెలల బాబుకి అరుదైన వ్యాధి

- వైద్యానికి రూ.16 కోట్లు
- ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ చెంగిచెర్లకు చెందిన మూడు నెలల బాలుడు శివమాన్విత్ అరుదైన స్పైనల్ మస్కులర్ ఆట్రోఫీ టైప్ అనే వ్యాధితో బాధ పడుతున్నాడు. ప్రయివేటు కంపెనీలో చిరుద్యోగి కుమారస్వామి, భవాని దంపతులకు రెండో సంతానంగా జన్మించిన ఈ బాలుడు పుట్టిన తర్వాత నెల రోజుల పాటు ఆరోగ్యంగా ఉన్నాడు. అకస్మాత్తుగా అనారోగ్యానికి గురి కావడంతో అతడిని నాచారంలోని ఇఎస్ఐ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరిశీలించి సనత్ నగర్ ఇఎస్ఐ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడికెళ్లిన తర్వాత అతడికి జన్యుపరమైన పరీక్షలు చేయాల్సి ఉందని తెలిపారు. బాలుని రక్తనమూనాలను సిసిఎంబికి పంపించి పరీక్షలు నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులు శివమాన్విత్‌ను హైదరాబాద్‌లోని ప్రయివేటు చిన్నపిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించారు. ఆ బాలునికి అరుదైన వ్యాధి ఉన్నట్టు గుర్తించారు. కాళ్లు, చేతులు సరిగ్గా కదిలించలేని స్థితిలో ఉన్న ఆ బాలుడి వ్యాధిని నయం చేయడానికి వాడాల్సిన మందు ఖరీదు రూ.పది కోట్లు కాగా, ఆ మందును దిగుమతి చేసుకునేందుకు రూ.ఆరు కోట్లతో కలిపి రూ.16 కోట్లు అవుతుందని డాక్టర్లు చెప్పడంతో తల్లిదండ్రులు షాక్‌కు గురయ్యారు. అదీ బాలునికి రెండేళ్లు వచ్చేలోపే చేయాలని వైద్యులు సూచించినట్టు కుమారస్వామి తెలిపారు. రోజులు దగ్గర పడుతుండటంతో ఆందోళన పెరుగుతోందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, దాతలు తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సహాయం చేయాలనుకునే వారు కుమారస్వామిని 63014 96492 నెంబర్‌లో సంప్రదించవచ్చు.

కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై కార్మికుల ఆగ్రహం

- రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా
- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో ధర్నాలు చేశారు. ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం చేశారు.

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సిఐటియు, ఎఐటియుసి, మూడు ఐఫ్‌టీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వరంగల్ జిల్లా మట్టెవాడ ఖమ్మం రోడ్డులోని ఇసుక అడ్డా వద్ద ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. ఖిలా వరంగల్ మండలం ఆర్‌డిఒ ఆఫీస్ కూడలిలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ములుగు జిల్లా కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నా చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిరసన తెలిపారు.

వనపర్తి జిల్లా కేంద్రంలో నిరసన చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. గద్వాల జిల్లా కేంద్రంలోని గద్వాల పాత బస్టాండ్ కృష్ణవేణి చౌక్ వద్ద నిరసన తెలిపారు.

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వివిధ కార్మిక సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వం తీరును ఎండగట్టారు. రెబ్బెన మండల కేంద్రంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. నిర్మల్‌లో వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి కట్ల రాజన్న కార్మికుల హక్కులపై దాడికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కార్మిక సంఘాలు నిరసన తెలిపాయి. బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంలో నిర్వహించిన ర్యాలీలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎర్ర అశోక్, జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొన్నారు. బాచుపల్లి పారిశ్రామిక ప్రాంతంలో ధర్నా నిర్వహించారు. షాపూర్‌నగర్‌లో రైతు బజార్ నుంచి ఉషోదయ టవర్స్ వరకు ఎఐటియుసి, సిఐటియు సంయుక్త ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన తీశారు. మల్కాజిగిరి చౌరస్తా నుంచి గాంధీ పార్క్ వరకు ర్యాలీ నిర్వహించి మహాత్మా గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఎల్బీనగర్ చౌరస్తాలో నిరసన తెలిపారు.

దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కార్మిక సంఘ నాయకులు

పిఆర్‌టియు తెలంగాణ ఎమ్మెల్సీ అభ్యర్థిగా జనార్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబ్‌నగర్ - రంగారెడ్డి - హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం పిఆర్‌టియు తెలంగాణ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రస్తుత శాసనమండలి సభ్యులు కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పిఆర్‌టియు తెలంగాణ అధ్యక్షులు ఎం చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి ఎం అంజిరెడ్డి మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలోని తొమ్మిది జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర కమిటీ అభిప్రాయం మేరకు జనార్ధన్‌రెడ్డి పోటీ చేస్తారని వివరించారు. రాష్ట్రపతి ఉత్తర్వులు-2018 ప్రకారం స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులకు బదిలీల్లో ప్రాధాన్యతను కల్పించాలనీ, సొంత జిల్లాకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 317 జిఒ వల్ల ఉపాధ్యాయుల్లో ఉన్న అసంతృప్తిని నివారించాలనీ, అప్పీళ్లను పరిష్కరించాలని కోరారు. నిషేధం విధించిన 13 జిల్లాల్లో స్పౌజ్ బదిలీలు చేపట్టాలని చెప్పారు. ఎనిమిదేండ్లుగా నిలిచిపోయిన బదిలీలు, పదోన్నతులను కొత్త జిల్లాల వారీగా చేపట్టేందుకు షెడ్యూల్ ప్రకటించాలని అన్నారు. అభ్యర్థి కె.జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమం కోసమే పనిచేశానని చెప్పారు. భవిష్యత్తులోనూ ఉపాధ్యాయులకు అండగా ఉంటానని అన్నారు. ఈర్ష్య, అభద్రతాభావంతోనే తనకు పిఆర్‌టియుటిఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వలేదన్నారు. ఈ నియోజకవర్గంలోని తొమ్మిది జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులతోపాటు మండలాలు సైతం తనకు అనుకూలంగా తీర్మానాలు చేసి రాష్ట్ర కమిటీ ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ ఆ సంఘం బైలా ప్రకారం 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శుల అభిప్రాయంతో తనకు అవకాశం ఇవ్వలేదన్నారు. నల్లగొండ, హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గాలకు ఆ పద్ధతిని ఎందుకు పాటించలేదని ప్రశ్నించారు. ఆయా నియోజకవర్గాల్లోని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శుల అభిప్రాయం మేరకే నిర్ణయం తీసుకోవడం ఎంత వరకు సమంజసమని అడిగారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు తెలంగాణ గౌరవాధ్యక్షులు పర్వతి సత్యనారాయణ, ఆర్థిక కార్యదర్శి ఎన్ చంద్రశేఖర్‌రావు, వ్యవస్థాపక అధ్యక్షులు ముకుందరెడ్డి, పత్రిక సంపాదకులు పి వెంకట్‌రెడ్డి, క్రమశిక్షణా కమిటీ అధ్యక్షులు అడప రామారావు తదితరులు పాల్గొన్నారు.

పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం

- మంత్రి సత్యవతి రాథోడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారంతోపాటు, అటవీ సంపద సంరక్షణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ప్రాజెక్ట్ అధికారులు, డిఎఫ్‌ఒలు, డిటిడిఒలతో అటవీ హక్కుల చట్టంపై కన్వర్జెన్స్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న పోడు సర్వేలో తలెత్తిన సమస్యలు వాటి పరిష్కారానికి మార్గాలపై అధికారుల సలహాలు, సూచనలు తీసుకుని దిశానిర్దేశం చేశారు. అటవీ హక్కుల చట్టం-2005 నిబంధనల ప్రకారం పోడు భూములు సాగు చేసుకుంటున్న వారికి శాశ్వతం పరిష్కారం దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకెళ్తున్నదన్నారు. పోడు వ్యవసాయదారులకు న్యాయం చేసేందుకు అడవులను సంరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సబ్ కమిటీని ఏర్పాటు చేసిందనీ, అటవీ హక్కుల చట్టం- 2005 పరిధికి లోబడి పోడు వ్యవసాయ దారులకు న్యాయం చేకూర్చే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్‌ఒఎఫ్‌ఆర్.2005 చట్టం, గ్రామ కమిటీలు హ్యాబిటేషన్, డివిజన్ వారీగా, జిల్లా కమిటీల ఏర్పాటు, కమిటీల బాధ్యతలు గురించి మంత్రి అధికారులకు వివరించారు.

గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఫైటింగ్ చేసినా.. గుర్తింపు లేదు

- చీఫ్‌విప్‌పై టిఆర్ఎస్ నాయకురాలి ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రహీమున్నీసా

'గల్లీ నుండి ఢిల్లీ దాకా ఫైటింగ్ చేసినా.. నాది ఒక్క ఫొటో పెట్టలేదు.. ఉద్యమంతో నా భర్త జాబ్ పోయింది.. నా కుటుంబం చిన్నాభిన్నమైంది. చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఒక్క పోస్టు ఇయ్య లేదు.. కార్పొరేటర్ టికెట్ ఇవ్వలేదు.. దొంగలకిచ్చుకున్నడు.. నా కడుపు మీద కొడుతరా.. ఉద్యమంలో నేను పని చేసిన వాటి ఫొటోలేవీ.. ? ఒక ముస్లిము మహిళను పక్కనపెడుతున్నరు..' అంటూ టిఆర్ఎస్ నాయకురాలు రహీమున్నీసా బేగం కన్నీటి పర్యంతమయ్యారు. హన్మకొండ పబ్లిక్ గార్డెన్‌లోని టౌన్ హాలులో దీక్షా దివస్ సందర్భంగా ఫొటో ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఆమె ఉద్యమంలో పాల్గొన్న ఒక్క ఫొటోనూ పెట్టకపోవడంపై రహీమున్నీసా బేగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా ఎగ్జిబిషన్‌లో ఫొటోలను చింపివేసి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉద్యమంలో పాల్గొన్న తన ఫొటోలను ఒక్కటైనా పెట్టకపోవడాన్ని ఆమె ఖండించారు. కాగా రహీమున్నీసా వ్యవహారం టిఆర్ఎస్‌లో చర్చనీయాంశంగా మారింది.

హక్కులపై మోడీ ఉక్కుపాదం

- ఉధృత పోరాటాలకు సన్నద్ధం
- విలేకర్ల సమావేశంలో ఎఐటియుసి నేతలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం శ్రామిక వర్గంపై ఉక్కు పాదం మోపుతున్నదనీ, ఈ నేపథ్యంలో మోడీ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఉధృత పోరాటాలకు సన్నద్ధం కావాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి యూసఫ్, ఎస్ బాలరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో వారు విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఇటీవల యాదగిరి గుట్టలో నిర్వహించిన ఎఐటియుసి రాష్ట్ర మూడో మహాసభలో కార్మికుల సంక్షేమం, హక్కులు, ప్రభుత్వ విధానాలు తదితర అంశాలపై 35 తీర్మానాలు చేసినట్టు తెలిపారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను విధ్వంసం చేస్తూ పరిశ్రమల అధిపతులకు అనుకూలంగా కేంద్రం తీసుకొచ్చిన నల్ల చట్టాలను తిప్పికొట్టాలన్నారు. కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలనీ, రక్షణ రంగాన్ని ప్రయివేటీకరణను ఆపాలని కోరారు. కార్మికులకు కనీస పెన్షన్ రూ.పది వేలు చెల్లించాలని, తిరోగమన బ్యాంకింగ్ సంస్కరణలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. మహాసభ 21 మందిని ఆఫీసు బేరర్లుగా, 39 మందిని వర్కింగ్ కమిటీ సభ్యులుగా, 131 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నదని తెలిపారు. సమావేశంలో ఎఐటియుసి డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎం నర్సింహం, జాతీయ నాయకులు రత్నాకర్‌రావు, ఉపాధ్యక్షులు ప్రేంపావని తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ప్రత్యేక సంక్షేమ శాఖ

- మహిళా శిశు సంక్షేమం నుండి విభజన
- మా పోరాటాల ఫలితంగానే - ఎన్‌పిఆర్‌డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇప్పటి వరకు స్త్రీ సంక్షేమ శాఖకు అనుబంధంగా ఉన్న వికంగుల, వయోజన సంక్షేమ శాఖ ఇకపై స్వయం ప్రతిపత్తితో పని చేయనున్నది. స్త్రీ సంక్షేమ శాఖ నుంచి వికలాంగుల శాఖను వేరు చేయడం ద్వారా వారి సంక్షేమానికి సత్వర నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు కలుగుతుంది. ఇందుకోసం రాష్ట్ర దళితాభివృద్ధి, సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేసిన కృషి ఫలించింది. కేసీఆర్ తోడ్పాటుతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా గుర్తిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో సిఎం కెసిఆర్‌కు మంత్రి కొప్పుల ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖగా మార్చేందుకు సిఎం చొరవతో ప్రభుత్వం జిఒ నెం. 33, 34 జారీ చేసిందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. శనివారం ప్రపంచ వికలాంగుల దినోత్సవ సందర్భంగా ఒకరోజు ముందుగానే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. వికలాంగులు, సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు సమర్థవంతమైన సేవలను అందించడానికి జిల్లా స్థాయిలో స్వతంత్ర శాఖకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.వికలాంగులు, వయోజనులు, ట్రాన్స్‌జెండర్ల కోసం జిల్లాల్లో తదనుగుణంగా అధికారులను తిరిగి నియమించనున్నట్టు తెలిపారు. అందుబాటులో ఉన్న క్యాడర్ స్ట్రెంత్‌ను పున్గపంపిణీ చేయడానికి ప్రభుత్వం అవసరమైన ఉత్తర్వులు జారీ చేయనుంది. మహిళా, శిశు సంక్షేమం, వికలాంగుల సంక్షేమ శాఖల మధ్య డిపార్ట్‌మెంట్, పని విభజన చేయనున్నారు. వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటంపై వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఆశాఖను స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో విలీనం చేసిన నాటి నుంచే ఎన్‌పిఆర్‌డితో పాటు పలు సంస్థలు అనేక పోరాటాలు నిర్వహించాయని తెలిపారు. ప్రభుత్వం వికలాంగుల హక్కుల పోరాటాలను గౌరవించి ఉత్తర్వులు జారీచేయటం హర్షనీయమన్నారు. ఇందుకోసం ప్రత్యేక కృషి చేసిన మంత్రి కొప్పుల ఈశ్వర్, వికలాంగుల కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మెన్ కె వాసుదేవ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమ శాఖ సాధన కోసం వికలాంగులు చేసిన ఉద్యమాల స్ఫూర్తితో రాబోయే కాలంలో మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు.

స్కాలర్‌షిప్‌ల రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

- కేంద్రానికి ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్కాలర్‌షిప్‌ల రద్దు నిర్ణయాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వెంటనే ఉపసంరించుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్కాలర్‌షిప్‌ల రద్దు వల్ల పేద విద్యార్థులు చదువులకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, ఐబిసి విద్యార్థులకిచ్చే స్కాలర్‌షిప్‌లను ఇవ్వబోమంటూ కేంద్రం ప్రకటించడం సరైందికాదని విమర్శించారు. పేద విద్యార్థులకు ఇస్తున్న స్కాలర్‌షిప్‌లు వారి చదువుకు ఎంతో ఉపశమనంగా ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ఉచిత నిర్బంధ విద్యను సాకుగా చూపి కేవలం తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకే ఈ స్కాలర్‌షిప్‌లను పరిమితం చేసేలా కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని విమర్శించారు. దీనివల్ల ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ, ఐబిసి విద్యార్థులు చదువులకు దూరమై డ్రాపౌట్స్ పెరిగే ప్రమాదముందని హెచ్చరించారు. దేశంలో వందశాతం అక్షరాస్యత సాధించాలంటూనే ఇలాంటి ప్రమాదకర నిబంధనలు తేవడంతో ఆ లక్ష్యం నెరవేరబోదని స్పష్టం చేశారు. ఈ నిర్ణయాన్ని కేంద్రం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థి, ప్రజాసంఘాలను కలుపుకుని ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు.

పేదలకు విద్యను దూరం చేసే కుట్ర : ఎఐఎస్‌ఎఫ్

స్కాలర్‌షిప్‌ల రద్దుతో పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్రను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్నదని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ఇవ్వబోమంటూ బిజెపి ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంభిన్నదని తెలిపారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

అమెరికాకు ఏటా 33 వేల మంది తెలుగు విద్యార్థులు

హైదరాబాద్ : అమెరికాలో చదువుల కోసం ప్రతీ ఏటా భారత్ నుంచి 84,000 మంది విద్యార్థులు వెళ్తున్నారని సెయింట్ లూయిస్ విశ్వవిద్యాలయంలో గ్లోబల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ డైరెక్టర్ ఎరిక్ ఎస్ ఆర్మ్‌బ్రెచ్ట్ తెలిపారు. ఎరిక్ హైదరాబాద్‌లో రెండు రోజుల పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మొత్తం భారతీయ విద్యార్థుల్లో 44 శాతం అంటే దాదాపు 33,000 మంది విద్యార్థులు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే ఉంటున్నారని వెల్లడించారు.